## సీఎం ఆస్ట్రేలియా పర్యటన రద్దు!

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దయినట్టు సమాచారం. ఆయన ఈ నెల 14న ఆస్ట్రేలియాకు వెళ్లాల్సి ఉన్నది. అక్కడి నుంచి 19న సింగపూర్‌కు, ఆ తర్వాత దావోస్‌లో పర్యటించాల్సి ఉన్నది. షెడ్యూల్‌లో మార్పులు జరిగినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సీఎం 14న ఢిల్లీకి వెళ్లనున్నారు. 15న ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. 16న ఢిల్లీలోనే ఉండి, 17న అక్కడి నుంచి బయల్దేరి సింగపూర్, 19న దావోస్‌కు వెళ్లి 20 నుంచి 23 వరకు అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొననున్నట్టు తెలిసింది.

## రైతు భరోసా 8,400 కోట్లు

### వనపర్తిలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ): యాసంగిలో రైతుభరోసా కింద రూ.8,400 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ నెల 26న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. వనపర్తిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు భూములన్నింటికీ ఎకరాకు ఏటా రూ.12 వేల చొప్పున అందించనున్నట్టు చెప్పారు.

## టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే!

### 'మీ టికెట్' యాప్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ(ఈఎస్‌డీ) రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు గురువారం సచివాలయంలో ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా ఆర్టీసీ, మెట్రో ప్రయాణం, తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, పార్కులు, పర్యాటక ప్రాంతాల ప్రవేశాలకు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ బుకింగ్‌లకు యూపీఐ ద్వారా అదనపు చార్జీలు ఉండవని చెప్పారు. ఇలాంటి మరిన్ని యాప్‌లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మీ-సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ జీ మల్సూర్, జూపార్క్స్ డైరెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకిశాల కృష్ణార్పణమేనా?

మొదటిపేజీ తరువాయి...



నెలలు గడుస్తున్నా పునరుద్ధరణ పనులు కనిపించడం లేదు. పంపుహౌజ్‌తో పాటు సాగర్‌లో మునిగిపోయిన సొరంగ మార్గాలు ఎప్పుడు తెరుచుకుంటాయనేది అంతుచిక్కడంలేదు. ప్రభుత్వం ఐదుగురు ఇంజినీర్లపై చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంది. కానీ ఇప్పటివరకు నిర్మాణ సంస్థ మేఘా కంపెనీపై చర్యలు తీసుకోలేదు.

### తెరపైకి కొత్త పైప్‌లైన్ ప్రతిపాదన

హైదరాబాద్ తాగునీటి కోసం కృష్ణా జలాలను సేకరించే ఏఎమ్మార్ ప్రాజెక్టులోని సిస్టర్న్, లింక్‌కెనాల్ శాశ్వత మరమ్మతులను ఈ వేసవిలోనే పూర్తి చేయాలంటూ నీటిపారుదలశాఖ ప్రభుత్వానికి లేఖ రాసింది. సిస్టర్న్‌కు గండిపడినట్లయితే ప్రాజెక్టు పంపుహౌజ్ జలదిగ్బంధమవుతుందని లేఖలో ఈఎన్సీ పేర్కొన్నారు. వాస్తవానికి సిస్టర్న్ లీకేజీ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిగిన రోజుల వ్యవధిలోనే చోటుచేసుకుంది. అప్పట్లో నీటిపారుదల శాఖ ఇంజినీర్లు నిపుణులతో సంప్రదించి గ్రౌటింగ్ పనులు చేపట్టి లీకేజీలను నియంత్రించారు. కానీ ఏనాడూ నెలల తరబడి నీటి సరఫరాను నిలిపివేయలేదు. ఈ దఫా మూడు నెలల పాటు నీటి సరఫరా నిలిపివేయాలని ఈఎన్సీ ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పుట్టంగండి నుంచి జలమండలి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి తెచ్చారు.


### తాత్కాలిక ప్రత్యామ్నాయం వెయ్యి కోట్లపైనే!

ఏఎమ్మార్ ప్రాజెక్టులో ప్రస్తుతం 18 మెగావాట్ల సామర్థ్యం గల 4 మోటార్లు ఉన్నాయి. ఒక్కో మోటారు నుంచి 600 క్యూసెక్కుల చొప్పున నీటిని ఎత్తిపోస్తారు. ఐదో మోటారు ఏర్పాటుకు సివిల్ పనులు గతంలోనే పూర్తి చేశారు. నాగార్జునసాగర్ నుంచి ఈ మోటార్ల ద్వారా నీటిని వంద మీటర్ల ఎత్తులోని సిస్టర్న్‌లోకి ఎత్తిపోస్తారు. హైదరాబాద్ తాగునీటి కోసం ఏర్పాటు చేయాల్సిన ఐదో మోటారు అనేది సిస్టర్న్‌లోకి నీటిని ఎత్తిపోసే పరిస్థితి ఉండదు. నేరుగా అక్కంపల్లి రిజర్వాయర్‌కుగానీ, జలమండలికి చెందిన కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రానికిగానీ పైప్‌లైన్ ద్వారా నీటిని ఎత్తిపోయాలి. అంటే ఇప్పుడు ఐదో మోటారు ద్వారా లిఫ్టు చేసే నీళ్లు ఈ వంద మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో పాటు దాదాపు పది కిలోమీటర్ల దూరం కూడా పోవాల్సి ఉంటుంది. ఇందుకు సాధారణంగా నీటిని తరలించే పైప్‌లైన్ కాకుండా పది కిలోమీటర్ల మేర 600 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యంతో ప్రెషర్ మెయిన్స్ (సాధారణ పైప్‌లైన్ల కంటే అధిక వ్యయం) వేయాల్సి ఉంటుందని రిటైర్డ్ ఇంజినీర్ ఒకరు తెలిపారు. లిఫ్టు సామర్థ్యం పెరగడంతో పాటు పది కిలో మీటర్ల దూరం నీటిని తరలించాల్సి ఉన్నందున మోటారు సామర్థ్యం ఇప్పుడున్న 18 మెగావాట్లు కాకుండా ఎక్కువగా ఉండాల్సిందేనని చెబుతున్నారు. రెండు కోణాలను పరిగణలోనికి తీసుకుంటే కేవలం పంపు, మోటార్లకే రూ.500 కోట్లకు పైగా వ్యయం అవుతుందని, పైప్‌లైన్, సివిల్, ఇతరత్రా పనులను కలుపుకుంటే వ్యయం రూ.వెయ్యి కోట్ల పైనే ఉంటుందని వివరించారు. ప్రస్తుతం అధికారులు అంచనాలు రూపొందిస్తున్నందున వాస్తవ వ్యయం ఎంత అనేది తేలాల్సి ఉంది. ఈ తాత్కాలిక ప్రత్యామ్నాయం సాగర్‌లో 510 అడుగులకు మించి నీటిమట్టం ఉంటేనే పని చేస్తుంది. లేకుంటే మోటార్ల డిశ్చార్జి తగ్గిపోతుంది.

### ప్రాజెక్ట్ భవితవ్యమేందో?

కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సుంకిశాల పథకం అంచనా వ్యయం రూ.2215 కోట్లు. ఇప్పటికే దాదాపు రూ.1500 కోట్లకు పైగా ఖర్చు చేశారు. మరో రూ.700 కోట్లు వరకు ఖర్చు చేస్తే నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ నుంచి కూడా హైదరాబాద్‌కు తాగునీటిని అందించే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. కానీ తాత్కాలిక పరిష్కారంగా 1000 కోట్లకు పైగా వెచ్చించి కొత్త పైప్‌లైన్ వేస్తే సుంకిశాల భవితవ్యమేంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుంకిశాల పూర్తయిన తర్వాత రెండింట్లో ఒకే మార్గం ద్వారా మాత్రమే నీటిని సేకరించేందుకు అవకాశం ఉంటుంది. మరో పథకం నిరుపయోగంగా ఉండాల్సిందేనని సీనియర్ ఇంజినీర్ ఒకరు అభిప్రాయపడ్డారు.

## లోకం పోకడ




అది నీ డైనింగ్ టేబుల్ కాదురా భడవా!

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 5.2°c | 34.8°c |
| రంగారెడ్డి | 8.5°c | 33.5°c |
| మెదక్ | 9.7°c | 32.3°c |
| హైదరాబాద్ | 10.5°c | 26.6°c |
| నిజామాబాద్ | 13.4°c | 30.5°c |
| వరంగల్ | 14.0°c | 29.0°c |
| ఖమ్మం | 16.0°c | 30.0°c |
| మహబూబ్‌నగర్ | 16.0°c | 27.0°c |
| కరీంనగర్ | 16.0°c | 27.0°c |
| నల్లగొండ | 17.2°c | 28.0°c |



## చలి @ 5.2 డిగ్రీలు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో రికార్డుస్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రత 5.2డిగ్రీలుగా నమోదైంది. వారంపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొన్నది. గురువారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 10 డిగ్రీలలోపు, మిగితా జిల్లాల్లో 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదు కాగా వాతావరణ శాఖ ఆరెంజ్,ఎల్లో అలర్ట్‌ను జారీచేసింది. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 5.9, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6.9 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు తెలిపారు.

## పెట్టుబడులను ఆకర్షించేలా వరంగల్ ఎయిర్‌పోర్టు

### భూసేకరణపై సమీక్షలో సీఎం రేవంత్ సూచన



హైదరాబాద్, జనవరి9 (నమస్తే తెలంగాణ): వరంగల్ మహానగరంగా అభివృద్ధి చెందేలా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. వరంగల్ (మామునూరు) విమానాశ్రయ భూసేకరణ, ఇతర ప్రణాళికలపై ఐసీసీసీలో సీఎం గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కొరియాతోపాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, వాటిని ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని అభిప్రాయపడ్డారు. కొచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందని.. దానిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. వరంగల్ ఔటర్‌రింగురోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ జిల్లాల ప్రజలు భవిష్యత్తులో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ విమానాశ్రయం పూర్తయితే మేడారం జాతరతోపాటు లక్నవరం, రామప్ప ఇతర పర్యాటక ప్రదేశాలకు వచ్చే ప్రజలు సైతం దానినే వినియోగించుకుంటారని తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ , సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయ్‌వీర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ , వరంగల్ కలెక్టర్ సత్య శారద, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీర్ల ధరల్లో 70 శాతం పన్నులే

- టీజీబీసీఎల్ నుంచి భారీగా బకాయిలు
- అందుకే సరఫరా నిలిపివేయాలనుకున్నాం
- మీడియాకు వెల్లడించిన యూబీఎల్




హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీర్ బ్రాండ్ల వినియోగ ధరల్లో సుమారు 70% ప్రభుత్వ పన్నులే ఉన్నాయని, తమకు నష్టాలు వస్తున్నా కూడా ఇప్పటివరకు కింగ్‌ఫిషర్ వంటి తమ బ్రాండెడ్ బీర్లను వినియోగదారులకు అందిస్తూ వచ్చామని యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దీనికితోడు తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) నుంచి తమకు భారీగా బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించేంత వరకూ తెలంగాణలో తమ బ్రాండ్ బీర్ల సరఫరాను నిలిపిస్తున్నామని స్పష్టం చేసింది. బీరు తయారీ ముడిసరుకు ధరలు పెరిగాయని, బీరు ధరలో తయారీ ధర కేవలం 16 శాతం మాత్రమేనని, అందులో 70% ప్రభుత్వ పన్నులే ఉంటాయని తెలిపింది. కంపెనీకి సకాలంలో చెల్లింపులు జరగడం లేదని, నష్టాలతో వ్యాపారం చేయలేకే తెలంగాణకు బీర్ల సరఫరా నిలిపివేయాలని నిర్ణయించినట్టు స్పష్టం చేసింది. రెండేండ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిలను కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు యూబీఎల్ తెలిపింది. ఈ మేరకు యూబీఎల్ ప్రతినిధులు ఆబ్కారీ శాఖ డైరెక్టర్ సీహెచ్ హరికిరణ్‌ను నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో కలిసి లేఖను అందించారు. మరోవైపు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కూడా కలిసినట్టు తెలిసింది.

## జాగ లేకుంటే ఇల్లు లేనట్టే!

- రెండో విడతలో జాగతోపాటు ఇల్లు
- 'ఇందిరమ్మ ఇండ్ల' ఫిర్యాదులకు వెబ్‌సైట్
- 95% పూర్తయిన దరఖాస్తుల పరిశీలన
- మంత్రి పొంగులేటి వెల్లడి



హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో స్థలం ఉన్నవారికే మంజూరు చేయనున్నట్టు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. రెండో దశలో జాగ లేనివారికి జాగ ఇచ్చి ఇల్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. మొదటి విడతలో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అ నాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కర్మచారీలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణకు రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి గురువారం సచివాలయంలో ప్రారంభించారు. ఇందిరమ్మ పథకానికి సంబంధించిన ఫిర్యాదులు ఏమైనా ఉంటే indirammaindlu.telangana. gov.inకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. ఫిర్యాదులు గ్రామాలకు సంబంధించినవైతే ఎంపీడీవోకు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌కు వెళ్తాయని తెలిపారు.అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

### జిల్లాల్లో 98 శాతం.. గ్రేటర్‌లో 88 శాతం

నల్లగొండ, మహబూబ్‌నగర్, కామారెడ్డి జిల్లాల్లో 98 శాతం వరకు ఇండ్ల పరిశీలన పూర్తయినట్టు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అధికారులు వివరించారు. ములుగు, కరీంనగర్, సంగారెడ్డి, సిరిసిల్ల, మెదక్ జిల్లాల్లో 97 శాతం, మహబూబాబాద్, జగిత్యాల, సిద్దిపేట, ఆసిఫాబాద్, జనగాం, రంగారెడ్డి, నిజామాబాద్, యాదాద్రి, పెద్దపల్లి జిల్లాలలో 96 శాతం పరిశీలన పూర్తయినట్టు అధికారులు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88 శాతమే పూర్తయినట్టు చెప్పారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఇండ్ల నిర్మాణానికి కార్యాచరణపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. సమావేశంలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

### 'భూ భారతి'కి గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన రెవెన్యూ బిల్లు 'భూ భారతి'ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గవర్నరర్ ఆమోదించిన బిల్లు కాపీని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ గురువారం సచివాలయంలో మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వీలైనంత త్వరలో చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా విధివిధానాల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూ భారతి చట్టాన్ని రూపొందించినట్టు చెప్పారు. కొత్త చట్టం ప్రకారం గ్రామాల్లో రెవెన్యూ పాలనను చూసేందుకు ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించనున్నట్టు తెలిపారు.

# ఇసుక దోపిడీకి భారీ స్కెచ్!

మొదటిపేజీ తరువాయి...

వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. మొత్తంగా 20 ఏండ్ల కాలపరిమితితో ఆయా డ్యాముల్లో పూడికతీత పనులను కాంట్రాక్ట్ సంస్థకు కట్టబెట్టనుండగా గుజరాత్‌కు చెందిన కంపెనీ కోసం ఓ ముఖ్యనేత ముందే దస్తీ వేసినట్టు పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. కాగా నిజంగా పూడిక నిండిన ప్రాజెక్టులను వదిలేసి ఎక్కువగా ఇసుక, నీళ్లు ఉన్న ప్రాజెక్టులను ఎంపికచేయడంపై ఇరిగేషన్‌శాఖలోనే తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకు పూడిక తీత అని కనిపిస్తున్నా.. ఇందులో సదరు గుజరాత్ కంపెనీతో కలిసి ఇష్టారాజ్యంగా ఇసుకను గొల్లగొట్టి జేబులు నింపుకొనే బాగోతం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు. ఇదంతా ఇసుక దోపిడీ కోసం తప్ప మరేమీ కాదని సాగునీటి రంగ నిపుణులు సైతం ఘంటాపథంగా చెప్తున్నారు.

### విధివిధానాలు ఖరారు కాకముందే..

జలాశయాలు, ప్రాజెక్టుల్లోని పూడికతీతకు సంబంధించి కేంద్రం 2022లో మార్గదర్శకాలు జారీ చేసింది. దానిపై అధ్యయనం చేసి రాష్ట్రంలో పూడికతీత చేపట్టేందుకు అవసరమైన సిఫారసులు చేయాలని ప్రభుత్వం సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ క్యాబినెట్ సబ్‌కమిటీ ఇటీవల ప్రత్యేకంగా సాగునీటి పారుదలశాఖ, మైన్స్ అండ్ జియాలజీ ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. పూడికతీతకు ప్రణాళికలు రూపొందించాలని, సమగ్రమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా ఇరిగేషన్‌శాఖ తాజాగా మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక సమర్పించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు మాత్రమే పూడికతీతకు సంబంధించి పాలసీలు అమలు చేస్తున్నాయని తెలిపింది. ఆయా రాష్ట్రాల పాలసీల్లోని అంశాలను నివేదికలో పొందుపరిచింది. ఇప్పటికే రాజస్థాన్‌ను సందర్శించామని, అదేవిధంగా మిగిలిన రాష్ట్రాల్లోనూ క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేయాలని, తద్వారా సమగ్రమైన విధానాలను రూపొందించుకునే అవకాశముంటుందని తెలిపింది. కాగా ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఇక అసలు ప్రాజెక్టుల్లో ఏ మేరకు పూడికలు ఉన్నాయి? అందులో ఏమున్నాయి? సారవంతమైన మట్టి ఎంత? చెత్తాచెదారం ఎంత? ఇసుక ఎంత మేరకు ఉంటుంది? ఏ మేరకు తవ్వకాలు చేపడుతారు? తదితర అంశాలపై స్పష్టత రాలేదు. పూడికతీతకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలనూ ప్రకటించలేదు. కానీ తాజాగా మూడు ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవడం గమనార్హం.

### ఇసుక దోపిడీకే!

డ్రెడ్జింగ్ విధానంలో ప్రాజెక్టుల్లో పూడికను అధునాతన యంత్రాల ద్వారా నీటి నుంచి తవ్వి తీసి అందులో మెటీరియల్‌ను దేనికదిగా వేరుచేస్తారు. ఇసుకను మార్కెట్‌లో విక్రయిస్తారు. ఇతర సిల్ట్, మెటీరియల్‌ను వ్యవసాయయోగ్యమైతే రైతులకు అందిస్తారు. సారవంతమైన మట్టి లేకుంటే దానిని డ్యామ్ పరిసరాలకు దూరంగా నిల్వ చేయడం, లేదంటే ఇతర అవసరాలకు వినియోగిస్తారు. ఈ విధానం ఇప్పటివరకు దేశంలో ఏ భారీ ప్రాజెక్టులోనూ అమలు చేయలేదు. రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో అమలు చేసినా అవి మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకే పరిమితం. దేశంలో తొలిసారిగా తెలంగాణలోని భారీ ప్రాజెక్టుల్లోనే దీన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనిపై ఇరిగేషన్‌వర్గాల్లో ఎక్కువగా వ్యతిరేకతే వ్యక్తమవుతున్నది. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మూడు డ్యాముల్లోనూ ఇసుక దోపిడీ తప్ప మరేమీ లేదని చెప్తున్నారు. నిజాంసాగర్, సింగూరు, ఎస్సారెస్పీతోపాటు అనేక ప్రాజెక్టుల్లో భారీగా పూడిక పేరుకుపోయింది. ఆయా ప్రాజెక్టుల్లోని పూడికపై అధ్యయనాలు సైతం కొనసాగాయి. కానీ వాటన్నింటినీ కాదని ఎల్‌ఎండీ, ఎంఎండీ, కడెం ప్రాజెక్టులనే ఎంపిక చేయడంలో ఆంతర్యం కేవలం ఇసుక దోపిడీయేనని వివరిస్తున్నారు. ముఖ్యంగా ఎల్‌ఎండీ, ఎంఎండీలో ఇసుక కోసమే ఇది చేపడుతున్నారని, కడెం ప్రాజెక్టును కేవలం పేరుకే చేర్చారని తేల్చిచెప్తున్నారు.

### గుజరాత్ కంపెనీకే?

ప్రాజెక్టుల పూడిక తీత వెనుక భారీ మంత్రాంగమే జరిగినట్టు రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే ఓ గుజరాత్ కంపెనీకి టెండర్లను కట్టబెట్టేందుకు లోపాయికారీగా రంగం సిద్ధమైందని నొక్కిచెప్తున్నారు. పూడికతీత అంశంపై ఇటీవల నిర్వహించిన సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీపరంగా ఓ నిర్ణయం తీసుకున్నారని, అందులోనే గుజరాత్ కంపెనీకి టెండర్లు కట్టబెట్టాలని కూడా నిర్ణయించినట్టు చర్చ నడుస్తున్నది. కాంగ్రెస్ పెద్దలు హడావుడిగా ఎలాంటి విధివిధానాలను ఖరారు చేయకుండానే ఏకంగా టెండర్లను ఆహ్వానించడం కూడా అందుకు ఊతమిస్తున్నది. మధ్యమానేరు, దిగువ మానేరు, దాని పొడువునా నిర్మించిన చెక్‌డ్యాముల్లో వేల కోట్ల విలువైన ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇంకా అనేక భారీ ప్రాజెక్టుల్లో ఇసుకతోపాటు, విలువైన మట్టి సైతం అందుబాటులో ఉన్నది. ఆ సహజ సంపదనంతా అనుయాయులకు దోచిపెట్టేందుకే పూడికతీత మాటున కాంగ్రెస్ ఇసుక దోపిడీకి తెరలేపిందని ఇంజినీర్లే చర్చించుకుంటుండడం గమనార్హం.

## కోర్టుకు గైర్హాజరైన మంత్రి సురేఖ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 9 (నమస్తే తెలంగాణ): సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖ గురువారం కూడా కోర్టుకు గైర్హాజరయ్యారు. వ్యక్తిగతంగా హాజరుకావాలని కోర్టు ఆదేశించినప్పటికీ, ప్రభుత్వ కార్యకలాపాల వల్ల రాలేకపోయారని పేర్కొంటూ ఆమె తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదిదారుడు నాగార్జున సైతం కోర్టుకు హాజరుకాలేదు. ఈ కేసు విచారణను కోర్టు ఈ నెల 16కు వాయిదా వేసింది.

## యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగనున్నట్టు వైద్యారోగ్యశాఖ తెలిపింది. నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం ఆరోగ్యశ్రీ సీఈవో శివశంకర్ చర్చలు జరిపారు. రోగులకు ఇబ్బంది కలిగించకుండా వైద్యసేవలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఏడాదిగా ఆరోగ్యశ్రీ కోసం హాస్పిటళ్లకు రూ.1130 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. 2013 నుంచి పెండింగ్ ప్యాకేజీల రేట్లను సవరించినట్టు తెలిపారు. పెండింగ్ బిల్లుల అంశాన్ని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## గోదావరి-బనకచర్ల లింక్ వివరాలివ్వండి

### జీఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ


హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గోదావరి-బనకచర్ల(జీబీ) లింక్ ప్రాజెక్టు వివరాలను ఇవ్వాలని గోదావరి జీఆర్ఎంబీని తెలంగాణ సర్కారు కోరింది. ఈ మేరకు జీఆర్ఎంబీకి అధికారులకు లేఖ రాశారు. గోదావరి నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున జలాలను బనకచర్ల మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించేలా ప్రాజెక్టును చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. ఏపీ చేపట్టనున్న ప్రాజెక్టు వివరాలను అందివ్వాలని బోర్డుకు కోరింది. మీడియా కథనాలను లేఖతో అటాచ్ చేసింది.

## ధరణిలో సాంకేతిక సమస్యలు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నది. హోం పేజీ మొదలు ఏ ఆప్షన్‌ను ఎంచుకున్నా సతాయింపు తప్పడం లేదు. మొదటిసారి 'సర్వీస్ అన్‌అవైలబుల్' అనే ఎర్రర్ మెసేజ్ వెక్కిరిస్తున్నది. రెండుమూడు ప్రయత్నాల అనంతరం పేజీలు ఓపెన్ అవుతున్నాయి. ఆ పేజీలు లోడ్ కావడానికి ఎదురుచూడాల్సి వస్తున్నది. తేదీలు ఎంపిక చేసుకోవాలన్నా కష్టంగా మారింది. ప్రతి దశలోనూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు మీసేవ నిర్వాహకులు, వినియోగదారులు వాపోతున్నారు.

## నకిలీ డాక్యుమెంట్‌తో ప్రభుత్వ విప్ దౌర్జన్యం!

- సూర్యాపేటలో 50 గుంటల భూమి కబ్జాకు రాంచందర్‌నాయక్ యత్నం
- మీడియా ఎదుట వాపోయిన బాధితుడు లక్ష్మీనర్సింహారావు



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న గుండపునేని లక్ష్మీనర్సింహారావు

సూర్యాపేట, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలోని తన భూమిపైకి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ వచ్చి దౌర్జన్యం చేస్తున్నాడని గుండపనేని లక్ష్మీనర్సింహారావు అనే వ్యక్తి ఆరోపించారు. గురువారం భూమిని ఆక్రమించేందుకు అనుచరులతో రాగా అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ 1990లో సూర్యాపేటకు చెందిన మధుసూదన్‌రెడ్డి, సువర్ణ, యాకూబ్ మేస్త్రీ వద్ద లింక్ డాక్యుమెంట్లు సరిచూసుకొని 50గుంటల భూమి కొనుగోలు చేశానని తెలిపారు. 2010లో విశ్రాంత తహసీల్దార్ సుందర్‌రావు ఇచ్చిన ఫేక్ పాస్‌బుక్‌తో తమ భూమిని అక్రమ డాక్యుమెంటేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. నాటి కలెక్టర్ రిజ్వీకి ఫిర్యాదు చేయగా ఆ పాస్‌బుక్‌ను రద్దు చేస్తూ, ఎలాంటి రిజిస్ట్రేషన్లూ చేయొద్దని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తుచేశారు. 2016లో రాంచందర్ నాయక్ భూమిని అక్రమించుకునేందుకు ప్రయత్నించగా, అడ్డుకొని అన్ని రకాల పత్రాలను ఉన్నతాధికారులకు సమర్పించడంతో ఆయనపై కేసు నమోదైనట్టు పేర్కొన్నారు. మళ్లీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. ఈ విషయం ఎస్పీ, డీజీపీ, సీఎం దృష్టికి సైతం తీసుకెళ్తానని చెప్పారు.



లోడింగ్ పనులను అడ్డుకున్న బ్రాహ్మణపల్లి గ్రామస్తులు

## ఇసుక క్వారీలో ఉపాధికి గ్రామస్తుల ఆందోళన

### బొమ్మాపూర్‌లో నిలిచిన ఇసుక లోడింగ్

మహదేవపూర్, జనవరి 9 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు ఇసుక క్వారీలో ఉపాధి కోసం గురువారం ఆందోళనకు దిగారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీలో తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇసుక డంపింగ్ తమ గ్రామ శివారులో ఉందని, టీజీఎండీసీ అధికారులు, క్వారీ నిర్వాహకులు బొమ్మాపూర్‌లోనే క్వారీ ఏర్పాటు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ ఇసుక క్వారీ బ్రాహ్మణపల్లి ఆధ్వర్యంలో నడవగా ఇక్కడి ప్రజలకు ఉపాధి దొరికిందని గుర్తుచేశారు. బొమ్మాపూర్‌లోనే క్వారీ ఉందని తమ గ్రామస్తులకు మాత్రమే ఇసుక క్వారీలో ఉపాధి పొందే అవకాశం ఉందని తేల్చి చెప్పడంతో చేసేదేమీలేక నిర్వాహకులు ఇసుక లోడింగ్ పనులు నిలిపివేశారు.